సాక్షి
ఖమ్మం
సోమవారం । 18 । మార్చి । 2024



విస్తరణ కలేనా..?

కేటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు మూతపడుతుండగా విస్తరణపై అధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో



దెబ్బకు తా.. కోతుల ముఠా

కోతుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు పొలం, తోటల చుట్టూ నెట్‌లు, సోలార్ విద్యుత్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
36° / 21°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. రాత్రి వాతావరణం కొంతమేర చల్లగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం సా॥) 6.25
సహర్ (మంగళవారం ఉ॥) 4.53



మహిళలే కీలకం

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 16,23,814 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 8,39,640 మంది, పురుష ఓటర్లు 7,84,043 మంది ఉండగా, మహిళా ఓటర్లు 55,597 మంది ఎక్కువ. ఇంకా ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 222, సర్వీస్ ఓటర్లు 886 మంది ఉన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 3,22,259 మంది, తక్కువగా అశ్వారావుపేట నియోజకవర్గంలో 1,58,647 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తంగా మహిళా ఓటర్లే అధికంగా ఉండడంతో అభ్యర్థుల గెలుపోటముల్లో వారే కీలకంగా వ్యవహరించనున్నారు. కాగా, ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- ఖమ్మం పార్లమెంట్ పరిధిలో ఓటర్ల సంఖ్య 16,23,814
- మొత్తం పోలింగ్ కేంద్రాలు 1,896
- అత్యధికంగా ఖమ్మంలో 3,22,259 మంది ఓటర్లు
- 85 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు హోం బ్యాలెట్
- వచ్చేనెల 15 వరకు ఓటు హక్కు దరఖాస్తుకు అవకాశం

నియోజకవర్గాల వారీగా ఇలా..

ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లలో మహిళలు 1,67,761 మంది, పురుషులు 1,54,447 మంది, పాలేరులో మహిళలు 1,24,402, పురుషులు 1,15,243, మధిరలో మహిళలు 1,14,699, పురుషులు 1,06,858, వైరాలో మహిళలు 99,243, పురుషులు 93,421, సత్తుపల్లిలో మహిళలు 1,24,750, పురుషులు 1,18,005, కొత్తగూడెంలో మహిళలు 1,27,301, పురుషులు 1,18,913, అశ్వారావుపేటలో మహిళా ఓటర్లు 81,484 మంది, పురుష ఓటర్లు 77,156 మంది ఉన్నారు. బరిలో ఉండే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించడంలో మహిళలే కీలకం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు వారిని ఆకర్షించడమే లక్ష్యంగా మేనిఫెస్టోలు రూపొందిస్తున్నాయి.

ఇంకా ఓటుకు అవకాశం..

18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈసీ జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1ని కటాఫ్ తేదీలుగా నిర్ణయించింది. ఈ తేదీల నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండితే ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకోని వారికి వచ్చే నెల 15 వరకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలిలా

నియోజకవర్గం	ఓటర్లు	పీఎస్‌లు
ఖమ్మం	3,22,259	355
పాలేరు	2,39,653	290
మధిర	2,21,567	268
వైరా	1,92,670	252
సత్తుపల్లి	2,42,767	294
కొత్తగూడెం	2,46,251	253
అశ్వారావుపేట	1,58,647	184
మొత్తం	16,23,814	1,896

వారికి హోమ్ బ్యాలెట్..

85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల కమిషన్ హోమ్ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించింది. వీరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా ఇంటి దగ్గరి నుంచే ఓటు వేసేలా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు. ఈ ఓటర్లలో పోస్టల్ బ్యాలెట్ కావాలనుకునే వారు ఫారం –12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులు గ్రామాలు, పట్టణాల్లో బూత్ లెవల్ అధికారుల వద్ద, తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా అందుబాటులో ఉంటాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్లు ఉన్న వృద్ధులకే పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండగా, దీన్ని ఎన్నికల సంఘం 85 ఏళ్లకు పెంచింది. జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వృద్ధ ఓటర్లు 10,318 మంది, దివ్యాంగ ఓటర్లు 30,389 మంది ఉన్నారు. మొత్తంగా 40,707 మంది హోమ్ పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు.

ఎన్నికలు సజావుగా నిర్వహిస్తాం

- కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ
- ఆన్‌లైన్ విధానంలో అనుమతులు
- కలెక్టర్ వీ.పీ. గౌతమ్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ

ఖమ్మం సహకారనగర్ : కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ లోక్‌సభ(ఎంపీ) ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ. గౌతమ్ తెలిపారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం ఆయన సీపీ సునీల్‌దత్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల చేసి, ఆరోజు నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరిస్తామని, 26న స్క్రూటినీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటాయని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఫలితాల వెల్లడి ఉంటుందని చెప్పారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఖమ్మం పార్లమెంట్ పరిధిలోకి వస్తాయని వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 16,23,814 మంది ఓటర్లతో పాటు 886 మంది సర్వీస్ ఓటర్లు, 222 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 85 ఏళ్ల వయసు పైబడిన వారు 10,318 మంది, దివ్యాంగులు 30,389 మంది ఉన్నారని, వీరిలో కోరుకున్న వారికి ఫారం–12 డీ ద్వారా హోం ఓటింగ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అర్హులంతా ఓటర్ జాబితాలో పేరు సరి చూసుకోవాలని, పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. మొత్తం 1,083 లొకేషన్లలో 1,896 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా పరిధిలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని వివరించారు.

సువిధ యాప్‌తో అనుమతి..

రాజకీయ పార్టీలు సమావేశాల నిర్వహణకు సింగిల్ విండో సిస్టం సువిధ యాప్ ద్వారా అనుమతిస్తామని, ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికే అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వైలెన్స్ బృందాలు, ఎంసీఎంసీ, వ్యయ పర్యవేక్షణ తదితర కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ఎవరైనా 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఏఆర్‌ఓలు తొమ్మిది మంది..

పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు తొమ్మిది మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉంటారని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్‌డీసీ రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీఓ గణేష్, కల్లూరు ఆర్డీఓ కె.శ్రీనివాస్‌తో పాటు భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి.వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ డి.మధును నియమించామని, అదనంగా జెడ్పీ సీఈఓ వినోద్, డీఆర్‌డీఓ సన్యాసయ్య ఉంటారని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఉండగా.. రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రం మాత్రం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేశామన్నారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ.. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 12 ఎఫ్‌ఎస్‌టీ, 15 ఎస్‌ఎస్‌టీ, 27 ఎంసీసీ టీమ్‌లు, 141 సెక్టార్ అధికారులను నియమించామన్నారు. 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్ పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచామని చెప్పారు. రూ.50 వేల పైబడి నగదు తరలిస్తే ఆధారాలు ఉండాలన్నారు. పెట్రోల్ బంక్, జ్యూవెల్లరీ, షాపింగ్ మాల్ నుంచి నిత్యం నగదు తరలింపు, బ్యాంక్ డిపాజిట్ వివరా లు, డబ్బు రవాణా చేసే ఏజెంట్ వివరాలు అందజేస్తే, ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, ట్రైనీ ఐపీఎస్ మౌనిక, జెడ్పీ సీఈఓ వినోద్, డీపీఆర్‌ఓ ఎం.ఏ గౌస్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు చేపట్టండి

ఖమ్మం అర్బన్ : చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటుచేసి విస్తృత తనిఖీలు నిర్వహించాలని, నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని కలెక్టర్ వీ.పీ. గౌతమ్ అన్నారు. ఆదివారం ఆయన సీపీ సునీల్‌దత్‌తో కలిసి ఎన్నెస్పీ కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి చెక్ పోస్ట్‌లో వీడియోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారి వెంట ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్. స్వామి తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'పది' పరీక్షలు



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర శర్మ

ఖమ్మం సహకారనగర్ : పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18(నేటి) నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 97 కేంద్రాల్లో 16,577 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు. 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరగనుండగా.. విద్యార్థులను 8:30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. కాగా ఆదివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షల నిర్వహణపై ఉన్నతాధికారులు సైతం విద్యాశాఖాధికారులతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి రద్దు

ఖమ్మం సహకారనగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి(గ్రీవెన్స్ డే)ని పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈ మేర కు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఉద్యోగులు సంఘటితం కావాలి



డైరీ ఆవిష్కరిస్తున్న ఏలూరి తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: ఉద్యోగులు సంఘటితంగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోవచ్చని గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని జిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సంఘాల విధి విధానాలు, సభ్యుల కర్తవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, పుష్పరాజ్, రామకృష్ణ, శ్రీనివాస్, నవీన్, సురేందర్‌రెడ్డి, వి.శ్రీనివాస్, శేషప్రసాద్, మౌనిక, భవానీదేవి, నాగరాజు, పుల్లారావు, విజయలక్ష్మి, విజయకుమారి పాల్గొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యమే దేశానికి మార్గదర్శి

ఖమ్మంమయూరిసెంటర్ : లౌకిక ప్రజాస్వామ్యమే దేశానికి మార్గదర్శి అని సామాజిక, రాజకీయ విశ్లేషకులు మిరియం వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని గుమస్తాల సంఘం భవనంలో 'డాక్టర్ వై.ఆర్.కే నెల నెలా వైద్య శిబిరం' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశమని, లౌకిక పునాదులు కలిగిన రాజ్యాంగం గలదని అన్నారు. మతం ఆధారంగా చట్టాలు చేయడం, పరిపాలన సాగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆ విధానాలనే కొనసాగిస్తోందని ఆరోపించారు. సీఏఏ చట్టాన్ని అమలు పరచడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ రకమైన చర్యలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రముఖ విద్యావేత్త మాదాల చార్లెస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, వైద్య శిబిరం నిర్వాహకులు యర్రా శ్రీకాంత్, బండారు రమేష్, డాక్టర్ సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాన్ పాతదేనా..?

- సీఎం ఆదేశాలతో అభివృద్ధి నివేదిక సిద్ధం!
- పదేళ్లనాటి మాస్టర్ ప్లాన్ ప్రకారమే భూ సర్వే
- భద్రాచల రామాలయానికి కొత్త ప్లాన్ రూపొందిస్తే మేలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి రంగం సిద్ధమవుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కలెక్టర్ మూడు రోజుల క్రితం దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించి భద్రాచలం అభివృద్ధికి నివేదికను సమర్పించాలని సూచించారు. దీంతో దేవస్థానం, రెవెన్యూ అధికారులు రెండు రోజుల క్రితం భూ సర్వే చేపట్టారు. అయితే కొత్త మాస్టర్‌ప్లాన్, నమూనాలపై దృష్టి సారించకుండా అధికారులు పాత మాస్టర్ ప్లాన్‌పై ఆధారపడుతుండటంతో విమర్శలు వినిపిస్తున్నాయి.

పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే ప్రణాళికలు..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రాచలం వచ్చి అభివృద్ధికి వరాల జల్లు కురిపించారు. దీంతో దేవస్థానం, వైదిక కమిటీలు, ఆర్కిటెక్ట్ ఆనందసాయి ఆధ్వర్యంలో మాస్టర్ ప్లాన్ రూపొందించారు. కానీ నిధులు విడుదల చేయకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. కొద్ది నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎ.రేవంత్‌రెడ్డి ఈ నెల 11న భద్రాచలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆలయం, భద్రాచలం అభివృద్ధికి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. దీంతో అధికారులు పాత మాస్టర్ ప్లాన్ ప్రకారం రెండు రోజుల క్రితం భూ సర్వే ప్రారంభించారు. ఆలయానికి ఉత్తర దిశగా ఉన్న మిథిలా స్టేడియం వైపు కాకుండా ఇతర మూడు దిక్కుల్లో సర్వే నిర్వహించారు. పాత ప్లాన్ ప్రకారం సుమారు రెండు ఎకరాల్లో 48 ఇళ్ల వరకు తొలగించాల్సి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. మాడ వీధులు, రహదారులు, ప్రాకారాలు, ఇళ్లు తొలగిపోయే వారికి నష్టపరిహారం సుమారు రూ.50 కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆలయం స్థానంలో గత నమూనాల ప్రకారమే ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



పాత మాస్టర్‌ప్లాన్‌లోని ఆలయ నమూనా చిత్రం

భక్తులు ఏం కోరుతున్నారంటే..

- పదేళ్ల క్రితం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌నే యథావిధిగా అమలు పర్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నూతన మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని భక్తులు కోరుతున్నారు.
- దేవస్థానానికి అనుబంధంగా ప్రాచీన చరిత్ర కలిగిన శివాలయం, నృసింహస్వామి ఆలయం, తాతగుడి సెంటర్‌లో గోవిందరాజ స్వాముల ఉపాలయాలు భక్తుల ఆదరణ లేకుండా ఉన్నాయి. శివాలయం, నృసింహస్వామి ఆలయం వరకు ఫ్లైఓవర్ ఫుట్ పాత్ బ్రిడ్జి నిర్మిస్తే రామయ్యను దర్శించుకున్న భక్తులు, వీటిని కూడా దర్శించుకునే అవకాశం ఉంది.
- లక్నవరం సరస్సులో నిర్మించినట్లు రామాలయం నుంచి గోదావరి కరకట్ట వరకు తీగల వంతెన నిర్మిస్తే భక్తులతోపాటు పర్యాటకులను ఆకర్షించవచ్చు. గోదావరి తీరం వరకు రోప్‌వే, కరకట్ట మీద మినీ ట్యాంక్ బండ్ నిర్మించాలని భక్తులు పేర్కొంటున్నారు.
- సామాన్య భక్తుల వసతి సమస్య తీర్చేలా డార్మెటరీ హాళ్లు నిర్మించాలి. సీఎం ఇచ్చిన నెల రోజుల గడువులోగా జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా కొత్త మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలని పలువురు కోరుతున్నారు.
- దేవస్థానం అధికారులు రూపొందించిన నివేదికను సోమవారం కలెక్టరేట్‌లో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాల సమీక్ష సమావేశంలో అందజేసే అవకాశం ఉంది. దీనిపై కలెక్టర్ పూర్తి స్థాయిలో సమీక్ష జరపాలని, ప్రతి ఏటా శ్రీరామ నవమి ఉత్సవాల్లో జరుగుతున్న పొరపాట్లు ఈసారి జరగకుండా చూడాలని, సామాన్య భక్తులు ప్రశాంతంగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని వీక్షించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన 'స్వప్నం రాల్చిన అమృతం'

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ప్రేక్షకులను అలరించింది. ఈ నాటికను కరీంనగర్ చైతన్య కళాభారతి కళాబృందం ప్రదర్శించగా.. మూలకథను పీఎస్ నారాయణ రూపొందించారు. నాటకీకరణ, రచన పరమాత్ముని శివరాం చేయగా రమేష్ మంచ, ఆల దర్శకత్వం చేశారు. అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్) అధ్యక్షుడు మోటమర్రి జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, శ్రీమిత్రా గ్రూప్స్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్, వెచ్చా రాజేంద్రకుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవికుమార్, వేల్పుల విజేత, ఆర్క్స్ సంస్థ కార్యదర్శి ఏఎస్ కుమార్, ప్రజానాట్యమండలి అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, సదానందం, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జగన్‌మోహన్‌రావు సతీమణి ఇందిర ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని అర్చకులు జరిపించారు. కాగా, ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు స్వామివారిని పెద్దఎత్తున దర్శించుకున్నారు.

అంతులేని జాప్యం

మున్సిపాలిటీల్లో రూ.కోట్లలో ఆస్తిపన్ను బకాయి

- ఆర్థిక సంవత్సరం మరో పదమూడు రోజులే..
- వడ్డీ రాయితీ ప్రకటనకూ స్పందన అంతంతే
- కోడ్ కూయడంతో ఎన్నికల విధుల్లోకి ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: నగర, పుర పాలక సంఘాల పరిధిలో అభివృద్ధి, నిర్వహణ ఆయా సంస్థలకు వచ్చే ఆదాయంపైనే ఆధారపడి ఉంటుంది. ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలకు ఆస్తి పన్నులే ప్రధాన ఆదాయ వనరు కాగా... ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 80శాతం నుండి 90 శాతం పన్నులు వసూలు చేయడం ఆనవాయితీ. కానీ ఈసారి మాత్రం వసూళ్లలో ఉద్యోగులు వెనుకబడ్డారు. మరో 13 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా.. ఇంకా రూ.కోట్లలో బకాయిలు మిగిలిపోయాయి. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా ఆశించిన మేర పన్నులు వసూలు చేయలేకపోతుండడం గమనార్హం.



ఖమ్మంలో పన్నుల వసూళ్లపై ఆరాతీస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి (ఫైల్)

ప్రణాళికాలోపంతో...

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో గతేడాది ప్రణాళికలు ఏర్పర్చుకుని అధికారులు పన్నులు వసూలు చేశారు. ప్రతీ ఆర్థిక సంవత్సరం జనవరి నుండే వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తూ బకాయిదారులకు నోటీసులు జారీ చేసేవారు. అయితే ఈ ఏడాది పలు కారణాలతో అధికారులు పన్నుల వసూళ్లపై శ్రద్ధ కనబర్చలేదని తెలుస్తోంది. కేఎంసీలో కమిషనర్ ఎన్నికల శిక్షణకు వెళ్లగా ఇతర అధికారులు వసూళ్లపై పట్టింపులేనట్లు వ్యవహరించారు. గతేడాది రూ.26 కోట్లకు పైగా పన్నులు వసూలు చేయగా.. ఈ ఏడాది కేఎంసీకి ఇప్పటి వరకు రూ.21.17కోట్లు మాత్రమే ఆదాయం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపాలిటీలో ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.5.39 కోట్లు మాత్రమే ఆదాయం సమకూరింది. మిగతా మున్సిపాలిటీల్లోనూ రూ.కోటి పైగా బకాయిలు ఉన్నాయి. ఖమ్మం నగర పాలక సంస్థలో కొన్ని రోజులుగా పది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రోజుకు రూ.30 లక్షల వరకు పన్నులు వసూలు చేస్తున్నారు. అయితే, ఎన్నికల కోడ్ ఈ కేంద్రాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

పదిహేను రోజులే గడువు..

నగర, పురపాలికలకు ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం ఆస్తి పన్నుల బకాయిలపై వడ్డీ రాయితీ కల్పించింది. ఒకేసారి బకాయి చెల్లిస్తే వడ్డీలో 90 శాతం రాయితీ ప్రకటించింది. ఈనెల 31వ తేదీ వరకు రాయితీతో పన్ను చెల్లించేందుకు అవకాశం ఉండగా, ఈ అంశంపై పెద్దగా ప్రచారం చేయడం లేదనే విమర్శలున్నాయి. కొన్నిచోట్ల ఆటోలకు మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నా... క్షేత్రస్థాయిలో బకాయిదారులకు మాత్రం సమాచారం ఇవ్వడం లేదని తెలుస్తోంది. గతేడాది జనవరి నుండే అధికారులు రెడ్ వైట్ నోటీసులు జారీ చేసి పన్నులు వసూలు చేశారు. ఈ ఏడాది మాత్రం గత వారం నుండే నోటీసుల జారీ మొదలుపెట్టారు. మరో పదిహేను రోజుల్లో రాయితీ గడువుతో పాటు ఆర్థిక సంవత్సరం ముగి యనుండగా, ఈలోపు ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచకపోతే ఆశించిన మేర ఆదాయం సమకూరే అవకాశం లేదు.

నగర, పురపాలక సంస్థల్లో పన్ను డిమాండ్.. వచ్చిన, రావాల్సిన ఆదాయం (రూ.కోట్లలో)

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	డిమాండ్	వసూళ్లు	బకాయి
ఖమ్మం	32.98	21.17	11.81
కొత్తగూడెం	8.96	3.57	5.39
పాల్వంచ	5.12	3.44	1.38
సత్తుపల్లి	4.72	3.41	1.31
వైరా	3.09	1.45	1.64
మధిర	2.57	1.79	0.78
మణుగూరు	2.04	1.16	0.88
ఇల్లెందు	1.68	1.31	0.38

ఎన్నికల ఎఫెక్ట్

ఆస్తి పన్నుల వసూళ్లపై ఎన్నికల ప్రభావం పడే అవకాశముంది. శనివారం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో అధి కారులు, ఉద్యోగులను ఎన్నికల విధులకు కేటాయిస్తారు. అధికారులు సైతం ఎన్నికలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఇవన్నీ పన్నుల వసూళ్లకు ఇబ్బందిగా మారనున్నాయి. దీంతో పూర్తి స్థాయిలో పన్నులు రాబట్టడంలో కోడ్ అడ్డంకిగా మారే అవకాశముందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఖమ్మంక్రైం : జిల్లాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల సమీపంలో నేటి నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంక్షలు అమల్లో ఉన్నందున పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించొద్దని, మైకులు, డీజేలు పెట్టొదని సూచించారు. పరీక్ష సమయంలో పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, పార్టీల, ప్రజా సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

వైరా వాసులకు రాష్ట్రస్థాయి పదవులు


నాయుడు సత్యం


నూతి శ్రీకాంత్

వైరా: వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాయుడు సత్యంతో పాటు నూతి శ్రీకాంత్‌కు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు లభించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల ప్రకటనలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాన అనుచరుడు నాయుడు సత్యంకు రాష్ట్ర హస్తకళల చైర్మన్ పదవి లభించింది. 2004–05లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కల్లుగీత కార్పొరేషన్ డైరక్టర్‌గా పనిచేసి డీసీసీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఆయనతో పాటు మరో సీనియర్ నాయకుడు నూతి అనంతరాములు మనవడు నూతి శ్రీకాంత్‌కు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న శ్రీకాంత్ ఎన్ఎస్‌యూఐ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే టికెట్ కోసం యత్నించి విఫలమయ్యారు.

జిల్లా సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్టు


చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉన్న ఎస్‌ఐ కోడెత్రాచు

నేలకొండపల్లి: మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామమైన పైనంపల్లి వద్ద పోలీసులు ఆదివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అంతర్ జిల్లా చెక్‌పోస్టును పైనంపల్లిలో ఏర్పాటు చేయగా ఎస్‌ఐ నాగరాజు పరిశీలించారు. గత ఎన్నికల మాదిరిగానే అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును నేలకొండపల్లి మండలంలోని అప్పలనర్సింహాపురం – కొంగర గ్రామాల మధ్య ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్ అధికారులు ఆదివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు.

పండితాపురం సంత వేలం వాయిదా

కామేపల్లి: కొమ్మినేపల్లి (పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీకృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత బహిరంగ వేలం వాయిదా వేసినట్లు జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ రవీందర్, కార్యదర్శి గుగులోత్ నెహ్రూ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 (సోమవారం)న సంత ఆవరణంలో బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉండగా జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్ ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు వారు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా సంత వేలం నిర్వహించవచ్చా లేదా అనే విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లిన తర్వాత వారి సూచనల మేరకు నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

రెండు బైక్‌లు ఢీ..

కూసుమంచి: మండలంలోని నేలపట్ల గ్రామ శివారు వీరన్నస్వామి ఆలయం రోడ్డులో ఆదివారం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఒక బైక్‌పై ఉన్న నూకల విక్రమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు 108 ద్వారా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

చెవిదిద్దులు కొనివ్వలేదని.. భర్తపై హత్యాయత్నం

ఖమ్మంక్రైం: తనకు బంగారు చెవిదిద్దులు కొనివ్వలేదని భర్తపై హత్యాయత్నానికి పాల్పడిన భార్యపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేటలో ఉండే షేక్ యాకూబ్‌పాషా కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, చెవిదిద్దులు కొనివ్వాలని ఆయన భార్య సమీనా తరుచూ గొడవపడుతూ ఉంది. ఆదివారం కూడా వారి మధ్య గొడవ జరిగింది. తన వద్ద డబ్బు లేదని, ప్రస్తుత పరిస్థితుల్లో కొనివ్వలేనని యాకూబ్‌పాషా తేల్చిచెప్పాడు. క్షణికావేశానికి గురైన సమీనా టర్పెంటాయిల్ భర్తపై పోసి నిప్పంటించింది. ఆయన గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సమీనాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విస్తరణ కలేనా..?

- కేటీపీఎస్‌లో కొత్త యూనిట్ల స్థాపనపై నిర్లక్ష్యం
- క్రమంగా పడిపోతున్న విద్యుదుత్పత్తి సామర్థ్యం
- మరోవైపు విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి రికార్డులు
- కొత్తగా 1,600 మెగావాట్ల యూనిట్ల స్థాపనకు ప్రణాళిక


కేటీపీఎస్ పాతప్లాంట్‌ను కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒకప్పుడు విద్యుత్ ఉత్పత్తిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే తలమానికంగా ఉన్న పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం(కేటీపీఎస్) క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోతోంది. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం క్రమంగా తగ్గిపోతుండగా కొత్తగా ఎటువంటి విస్తరణ ప్రణాళికలు కనుచూపు మేరలో కనిపించడం లేదు. చివరికి సింగరేణి సైతం ఇతర ప్రాంతాలపైనే దృష్టి సారిస్తూ కొత్తగూడేన్ని నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

'పవర్'ఫుల్ సింగరేణి..

సింగరేణి బొగ్గు గనులను ఆధారంగా చేసుకుని ముందుగా పాల్వంచలో, ఆ తర్వాత రామగుండం, భూపాలపల్లిలలో థర్మల్ విద్యుత్ కేంద్రాలు జెన్‌కో ఆధ్వర్యంలో ఏర్పాటయ్యాయి. అనంతరం సింగరేణి సైతం విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి దిగింది. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 600 మెగావాట్ల సామర్థ్యం(మొత్తం 1200 మెగావాట్లు)తో రెండు యూనిట్లు నిర్మించింది. ప్రస్తుతం ఈ ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తిలో సరికొత్త రికార్డులు నెలకొల్పుతూ దేశవ్యాప్తంగా సింగరేణికి మంచి పేరు తెచ్చిపెడుతోంది. దీంతో ఇక్కడే అదనంగా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో మూడో ప్లాంటు నిర్మాణానికి సింగరేణి అన్ని రకాల అనుమతులు తీసుకుంది. దీంతో జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం(ఎస్‌టీపీపీ) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం రెండు వేల మెగావాట్లకు చేరుకోనుంది. ఎస్‌టీపీపీ అందించిన విజయోత్సాహంతో మరిన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపనకు సింగరేణి సిద్ధమైంది. త్వరలోనే నిర్మాణ పనులకు సంబంధించి శంకుస్థాపన చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

తెరపైకి రామగుండం

మంచిర్యాల జిల్లాలోని ఎస్టీపీపీతో పాటుగా పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పేందుకు సింగరేణి సిద్ధం అవుతోంది. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తిలో రామగుండం రీజియన్ సింగరేణిలోనే అగ్రభాగాన ఉంది. ఇక్కడ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో భారీ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించింది. ఎప్పటికప్పుడు ఈ ప్లాంట్ విస్తరణ పనులు చేపడుతోంది. దీంతో పాతదైన జెన్‌కో ప్లాంట్‌ను దశాబ్దాల క్రితమే మూసివేశారు. ఈ స్థలంలో కొత్తగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సింగరేణి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభించింది.

కేటీపీఎస్‌లో 400 ఎకరాలు..

కేటీపీఎస్‌లో పాతవైన ఏ, బీ, సీ ప్లాంట్లను పూర్తిగా తొలగించే ప్రక్రియ ఏడాది క్రితం మొదలైంది. ఇప్పటికే థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన అన్నింటినీ తొలగించారు. చిమ్నీలను కూడా కూలగొట్టారు. కూలింగ్ టవర్లను తొలగించాల్సి ఉంది. నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ కల్లా పాత ప్లాంట్లకు సంబంధించిన వాటన్నింటినీ తొలగించాల్సి ఉంది. అప్పుడు సుమారు 400 ఎకరాల స్థలం అందుబాటులోకి వస్తుంది. కొత్త విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు లభిస్తుంది. తెలంగాణ వచ్చిన తర్వాత మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1,200 మెగావాట్లు, భూపాలపల్లిలో 600 మెగావాట్లు, మణుగూరులో 1,080 మెగావాట్లు, యాదాద్రిలో 1,600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు పూర్తయ్యాయి. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో కొత్తగా 800 మెగావాట్ల ప్లాంట్ వచ్చింది. కానీ కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో ఎలాంటి విస్తరణ జరగలేదు సరికదా పాత ప్లాంట్లు మూతపడ్డాయి. ఇప్పటికైనా పాల్వంచలో అందుబాటులోకి వస్తున్న 400 ఎకరాల్లో కేటీపీఎస్ విస్తరణ జరిగేలా చూడాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

తొలి పవర్ ప్లాంట్


పాల్వంచలోని కేటీపీఎస్

స్వాతంత్య్రం వచ్చిన కొత్తలో దేశ పారిశ్రామిక, గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వాలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాయి. అలా పాల్వంచ సమీపాన 1966 సెప్టెంబర్ 4న తొలి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 60 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ఆ తర్వాత పెరుగుతున్న పారిశ్రామిక, గృహ అవసరాలకు తగ్గట్టుగా క్రమంగా విస్తరించారు. దీంతో పదేళ్ల కిందట 2,580 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో విజయవాడలోని నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో సరిసమానంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు, కార్మికులతో పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలు కళకళలాడాయి. అయితే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో పాత ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తిని క్రమంగా నిలిపేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,800 మెగావాట్లుగా ఉంది.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

అదనపు కలెక్టర్ సత్యప్రసాద్


సత్తుపల్లిటౌన్: విగ్రహాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సత్తుపల్లిటౌన్: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని, నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల నియమావళి అమలు తీరును ఆదివారం తనిఖీ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న విగ్రహాలకు పూర్తిస్థాయిలో ముసుగులు వేయకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రింగ్‌సెంటర్, కల్పతరుసెంటర్‌లోని హోర్డింగ్‌లకు ప్రభుత్వ పథకాల ప్రకటనలు, రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, ఎన్టీఆర్ ప్రత్యామ్నాయకాలువ గోడలపై రాజకీయ పార్టీల వాల్‌రైటింగ్‌లను పరిశీలించి వెంటనే తొలగించాలని కమిషనర్ రవిబాబును ఆదేశించారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట కమిషనర్ రవిబాబు, టీపీఓ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన


బోనకల్: వాహనాలు తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

బోనకల్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదివారం పరిశీలించారు. రాష్ట్ర సరిహద్దు నుంచి వచ్చే వాహనాలను ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. 24 గంటల పాటు వాహనాల తనిఖీలు ఉంటాయన్నారు. ఫ్లెక్సీలు, రాజకీయ నాయకుల విగ్రహాలు, జెండా దిమ్మెలు కనపడకుండా ముసుగులు వేయాలని తహసీల్దార్ పున్నంచందర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ శాస్త్రి ఉన్నారు.

వర్గీకరణ చేపట్టాకే ఓట్లు అడగాలి..



అశ్వాపురంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

అశ్వాపురం: మాదిగల వర్గీకరణ చేపట్టాకే బీజేపీ ఓట్లు అడగాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మాదిగల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో సమానంగా ఉద్యమాన్ని నడిపి ఎన్నో కేసులు అనుభవించానని, జాతి కోసం అహర్నిశలు కష్టపడుతూ ఏ పదవి ఆశించకుండా పని చేస్తున్నానని చెప్పారు. సంగారెడ్డిలో మాదిగ రిజర్వేషన్ల సాధనకై పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కుల గణన చేపడుతుందని అదే లెక్కల ప్రకారం.. రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రామమందిరం నిర్మించి ఓట్లు అడుగుతున్నారని అదేరీతిలో మాదిగలకు వర్గీకరణ చేపట్టి ఓట్లు అడగాలన్నారు. రానున్న రోజుల్లో మాదిగలను ఏకం చేసి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా ఉద్యమాలు చేపడుతామన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పిడమర్తి రవి పూలమాలలు వేసి నివాళులర్పించి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్, మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మిరియాల నరసింహారావు, మాదిగ జేఏసీ జిల్లా నాయకుడు దేపంగి వెంకటరమణ, సోంపల్లి తిరుపతి, కొడారి వెంకటేశ్వర్లు, గద్దల గౌతమ్, భానుప్రసాద్, చందూ, పాడుతూరి ప్రసాద్, ప్రదీప్, దేవమణి, దుర్గారావు, గొల్లపల్లి నరేశ్, రాజశేఖర్, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చి పడేస్తా..

- ప్రహరీ నిర్మాణంపై ప్రశ్నించినందుకు ఓ ఏఆర్ కానిస్టేబుల్ బెదిరింపు
- వీధిపోటు సాకుతో రోడ్డు మూసేసిన వైనం


దారి మూసివేసిన దృశ్యం


గాయపడిన బాధితులు

బోనకల్: 'నా దగ్గర తుపాకీ ఉంది.. కాల్చి పడేస్తా..' అని ఓ ఏఆర్ కానిస్టేబుల్ తన ఇరుగుపొరుగు వారిపై దాడి చేసి బెదిరించాడు. తన ఇంటికి వీధిపోటు ఉందని నడిచే బాటను మూసివేసి ప్రశ్నించిన వారిపై దాడిచేసిన ఘటన మోటమర్రి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్రి రమేశ్ నూతనంగా గృహం నిర్మించుకుని 20 కుటుంబాలు నడిచే దారిని వీధిపోటు సాకు చూపి చెప్పి ప్రహరీ కట్టి మూసివేశాడు. ఈ విషయంపై కొంతకాలంగా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. నిర్మాణం చేసిన వ్యక్తి ఏఆర్ కానిస్టేబుల్ కావడంతో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వద్ద పనిచేస్తుండడంతో అధికారులు అతడిని చూసీచూడనట్లుగా వదిలేశారు. పంచాయతీ అధికారులు పలుసార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన తీరు మారలేదు. శనివారం తహసీల్దార్ పున్నంచందర్, ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ శాస్త్రి ఘటనా స్థలానికి వెళ్లి రమేశ్‌ను హెచ్చరించారు. దీంతో రమేశ్, అతడి కుటుంబ సభ్యులు.. ఆ బాటలో నడిచే గుడిద వెంకమ్మ, మరీదు తిరపతిరావు, మరీదు నాగేశ్వరరావు, మరీదు స్వామి, గుడిద నాగేశ్వరరావుపై దాడి చేశారు. 'నా దగ్గర తుపాకీ ఉంది.. కాల్చి పడేస్తా'అని బెదిరించాడు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

పెనుబల్లి: మండలంలోని కర్రాలపాడు గ్రామ శివారు మామిడితోటలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వీఎం బంజర్ ఎస్‌ఐ వెంకటేశ్ సిబ్బందితో దాడి చేసి 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,900 నగదు, రెండు కోడి కత్తులు, ఏడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కూసుమంచి: మండలంలోని కోక్యాతండా గ్రామానికి చెందిన బాణోతు విజయ(43) ఈ నెల 15వ తేదీన చేనులో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న విజయ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కుమారుడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షోరూంలో చోరీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని పాతసెంటర్‌లో గల యమహా షోరూం.. లక్ష్మీ ఫైనాన్స్ కార్యాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎప్పటిలాగే సిబ్బంది వాహనదారుల నుంచి వసూలు చేసిన ఈఎంఐ సొమ్మును కార్యాలయంలోని లాకర్లో పెట్టి ఆఫీస్‌ను మూసివేసి వెళ్లిపోయారు. అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయం వెనుక తలుపును బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. లాకర్‌ను పగలగొట్టి అందులోని సుమారు రూ.40 వేలు నగదు, కొన్ని ఆర్సీ కార్డులను చోరీ చేశారు. గుర్తించిన సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఖమ్మం నుంచి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భారీగా మద్యం స్వాధీనం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో నిల్వ చేసిన మద్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై జీవన్‌రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ఇంట్లో మద్యాన్ని నిల్వ చేసినట్లు అందిన పక్కా సమాచారంతో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ పర్యవేక్షణలో ఎస్సై జీవన్‌రాజుతో కలిసి దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమంగా మద్యం నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఈటీలపై శీతకన్ను..

శిక్షణ పూర్తి చేసుకున్న వేలాది మంది

- 1,600 పోస్టులకు గాను 182 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- నిరుద్యోగుల ఆందోళనలను పట్టించుకోని ప్రభుత్వం


ఫుట్‌బాల్ ఆడుతున్న 'వ్యాయామ' కళాశాల విద్యార్థులు

ఖమ్మంస్పోర్ట్స్: విద్యలో అంతర్భాగంగా నిలిచే వ్యాయామ విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్న పీఈటీ పోస్టులే అందుకు నిదర్శనమని చెబుతున్నారు. చాలా కాలం తర్వాత డీఎస్సీ ద్వారా పీఈటీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ, అతి తక్కువ ఖాళీలను చూపి భర్తీ చేస్తున్నట్లు అభ్యర్థులు చెబుతున్నారు. రాష్ట్రంలో దాదాపు 1,600 పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం 182 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఏటా ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాయామ కళాశాలల నుంచి 2,300 మందికి పైగా శిక్షణ పొందిన వారు వస్తున్నారు. వారిలో అధికంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చాలీచాలని వేతనాలతో వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్సీ కొన్నేళ్లుగా వేయకపోవడంతో కొందరు వయోపరిమితి దాటి ఇతర వృత్తుల్లో నిమగ్నమయ్యారు.

పోస్టులు నామమాత్రమే

కేంద్ర ప్రభుత్వం పీఈటీలను నియమించే విషయంలో అడ్వయిజరీ కమిటీని 1975లోనే వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు అభ్యసిస్తుండగా వారికి ఫిజికల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇచ్చేవారు లేకపోవడం దారుణమని వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు వేసే అసైన్‌మెంట్ మార్కులను పీఈటీలు లేనిచోట సబ్జెక్టు టీచర్లే వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కేంద్ర అడ్వయిజరీ కమిటీ నిబంధనల ప్రకారం ప్రతి 250 మంది విద్యార్థులకు ఒక పీఈటీ ఉండాలి. కానీ, ఈ నిబంధనలను ప్రభుత్వాలు ఎప్పుడో విస్మరించాయి. ఒక్కో పాఠశాలలో కనీసం వెయ్యి మంది విద్యార్థులు ఉన్నా.. ఒక్క పీఈటీ మాత్రమే ఉంటున్నారని నిరుద్యోగ పీఈటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు హాజరయ్యే వారి క్రీడా సర్టిఫికెట్లను పరిగణనలోకి తీసుకుని వారికే ర్యాంకులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని క్రీడా నిపుణులు అంటున్నారు. ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా పీసెట్‌కు వచ్చే వారిని పరిగణనలోకి తీసుకుంటే క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని వారంటున్నారు.

నిధుల వసూలు లేదు..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి క్రీడా రుసుం వసూలు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల నుంచి వసూలు చేసిన నిధులను క్రీడా వస్తువుల కొనుగోలు, పాఠశాల అంతర్గత క్రీడా పోటీల నిర్వహణ, మండల, జిల్లాస్థాయి పాఠశాలల క్రీడల కోసం ఖర్చు చేయాల్సి ఉంది. కానీ, కొన్ని పాఠశాలల్లో నిధులు వసూలు చేయడం లేదని.. మరికొన్ని పాఠశాలల్లో ఈ నిధులను ఇతర ఖర్చుల కోసం వాడుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోస్టులు భర్తీ చేయాలి



రాష్ట్రంలో వేలాది పీఈటీ పోస్టులు, జూనియర్ కళాశాలల్లో 300కు పైగా పీడీ పోస్టులు, డిగ్రీ కళాశాలల్లో 110 పైగా పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. కొన్ని ఏళ్లుగా ఖాళీగా ఉన్నా పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం జీఓ నం–29 విడుదల చేసింది. దీని ప్రకారం పీఈటీ, పీడీ పోస్టులను భర్తీ చేయాలి.

– సలికంటి వినోద్, నిరుద్యోగ పీఈటీ సంఘం నాయకుడు

కళాశాలలను మూసి వేయాలి



రాష్ట్రంలోని వ్యాయామ ఉపాధ్యాయ కళాశాలలు నిరుద్యోగ కార్ఖానాలుగా మారుతున్నందున వెంటనే వాటిని మూసివేయాలి. లేదా రాష్ట్రంలో ప్రతి పాఠశాలలో పీఈటీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. 2024 డీఎస్సీలో పీఈటీ పోస్టులను రద్దు చేసి మరిన్ని పోస్టులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించే విధంగా కార్యాచరణ రూపొందిస్తాం.

– శాగంటి రాజేశ్, స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు

క్లుప్తంగా...

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా బాబు, వెంకన్న

ఖమ్మం మయూరి సెంటర్: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న ఈయూ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.పద్మాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్అలీ, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకట్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శులుగా పాటి అప్పారావు, జె.రాఘవ, ప్రచార కార్యదర్శిగా సి.శంకర్, కోశాధికారిగా జి.డి.ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 36 మందితో రాష్ట్ర కార్యనిర్వహణ సమితిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకన్న మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నూతన కమిటీ పని చేస్తుందన్నారు. ఈ సభలకు రాష్ట్రంలోని 95 డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

తాటి చెట్టుపై గీత కార్మికుడి హఠాన్మరణం


చెట్టుపై తలకిందులైన వెంకన్నను కిందకి దించుతున్న గీత కార్మికులు

తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లాలో ఓ గీత కార్మికుడు తాటిచెట్టుపైనే గుండెపోటుతో మృతిచెందాడు. తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్ (40) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం వెంకన్నగౌడ్ రోజూ మాదిరిగా కల్లు తీసేందుకు గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. వెంకన్న చెట్టు పైభాగానికి ఎక్కగానే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో తలకిందులయ్యాడు. తోటి గీత కార్మికులు ఇది గమనించి అతడిని కిందకి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు.

నృసింహస్వామి పెళ్లికొడుకాయెనే..

యాదగిరిగుట్టలో వైభవంగా స్వామివారి ఎదుర్కోలు మహోత్సవం ● నేటి రాత్రి శ్రీస్వామి కల్యాణోత్సవం


ఆదివారం రాత్రి యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఎదుర్కోలు మహోత్సవాన్ని జరిపిస్తున్న ఆలయ ఆచార్యులు


స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకొస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీదేవి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా జరిపించారు. ఉదయం ప్రధానాలయ మాడ వీధుల్లో శ్రీస్వామి వారు జగన్మోని అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక సాయంత్రం శ్రీస్వామి వారు అశ్వవాహనంపై పెండ్లి కొడుకుగా, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అమ్మవారిని సేవోత్సవంగా ఆలయ మాడవీధిలో ఊరేగించారు. అనంతరం ఆచార్యులు, అధికారులు స్వామి వారి పక్షాన, అమ్మవారి పక్షాన చేరి గుణగణాలను చర్చించుకున్నారు. శ్రీనృసింహస్వామికి లక్ష్మీదేవితో వివాహం జరిపేందుకు ముహూర్తాన్ని ఆచార్యులు నిర్ణయించారు.

గజవాహనంపై కల్యాణోత్సవానికి..

తిరుకల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి 8.45 గంటలకు గజవాహనంపై శ్రీస్వామి, ప్రత్యేక పల్లకిపై అమ్మవారు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ 9.15 గంటలకు ఉత్తర దిశలోని రథశాల ముందు ఏర్పాటు చేసిన కల్యాణ మండపానికి చేరుకుంటారు. ఆ తరువాత శ్రీస్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకను ఆచార్యులు, వేద పండితులు పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం వేద మంత్రాలతో ప్రారంభిస్తారు. తుల లగ్న ముహూర్తంలో రాత్రి 9.37 గంటలకు శ్రీస్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ చేయనున్నారు. ఇక ఉదయం శ్రీస్వామి వారు శ్రీరామ అలంకారంలో హనుమంత వాహన సేవపై ఊరేగనున్నారు.

యాదాద్రీశుడి కల్యాణానికి టీటీడీ పట్టువస్త్రాలు

శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవాలకు టీటీడీ తరఫున ఆదివారం పట్టు వస్త్రాలను అందజేశారు. ఉదయం టీటీడీకి చెందిన ఉప కార్యనిర్వహణాధికారి లోకనాథం మేల్చాట్ పట్టు వస్త్రాలను తీసుకొని, ఆలయ మాడ వీధిలో ఊరేగింపుగా వచ్చారు.జగన్మోహిని అలంకార సేవ ముందు పట్టు వస్త్రాలను ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులకు అందజేశారు.

యాదాద్రి స్వామికి వాహన సేవలు బహూకరణ


మహా బలిపురం నుంచి తీసుకువచ్చిన వాహనాలు

యాదగిరిగుట్ట: శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి సేవోత్సవంలో వినియోగించే వాహన సేవలు బంగారుమయంగా మారనున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ దాత గజ, గరుడ, శేష వాహనాలను పంచ లోహంతో తయారు చేయించి ఆదివారం యాదాద్రి ఆలయానికి తీసుకువచ్చారు. తమిళనాడులోని మహాబలిపురంలో రవీంద్రన్ స్థపతి ఆధ్వర్యంలో ఈ వాహనాలు ప్రత్యేకంగా రూపుదిద్దుకున్నాయి. వీటిని శిల్పులు యాదాద్రికి తీసుకురావడంతో ఆలయ ప్రధానార్చకులు పరిశీలించారు. ఆయన సూచనల మేరకు గజ, గరుడ, శేష వాహన సేవలను తిరిగి మహాబలిపురం తీసుకెళ్లి, బంగారు తాపడం పనులు చేయనున్నట్లు తెలిసింది. 20 రోజుల తరువాత దాత..ఆలయాధికారులు, ఆచార్యులకు అందజేయనున్నట్లు సమాచారం.

కువైట్‌లో మళ్లీ క్షమాభిక్ష అమలు

- జూన్ 17 వరకు 90 రోజుల పాటు చాన్స్
- జరిమానా, జైలు శిక్ష లేకుండా సొంతూరికి వెళ్లడానికి అవకాశం

మోర్తాడ్(బాల్కొండ): వీసా గడువు ముగిసిపోయినా చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు వారి సొంత గడ్డకు వెళ్లడానికి కువైట్ ప్రభుత్వం ఆమ్నెస్టీ (క్షమాభిక్ష)ని ప్రకటించింది. ఆదివారం మొదలైన క్షమాభిక్ష.. జూన్ 17వ తేదీ వరకు కొనసాగనుంది. చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు తమ దేశాలకు వెళ్లిపోవడానికి కువైట్‌లోని ఎంబసీల్లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. కరోనా సమయంలో క్షమాభిక్ష అమలు చేయగా, నాలుగేళ్ల విరామం తర్వాత మరోసారి ఆమ్నెస్టీని ప్రకటిస్తూ కువైట్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. కువైట్‌లో వివిధ దేశాలకు చెందిన వలసదారులు 1.65 లక్షల మంది ఉన్నారని అంచనావేస్తున్నారు. ఇందులో తెలుగు రాష్ట్రాల కార్మికులు సుమారు 15 వేల మంది వరకు ఉంటారని కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. కరోనా సమయంలో 2020లో అమలు చేసిన అమ్నెస్టీతో భారీ సంఖ్యలో కార్మికులు ఇంటిబాట పట్టారు. ఇప్పుడు మరోసారి క్షమాభిక్ష అమలు చేస్తుండటంతో పెద్ద సంఖ్యలోనే వలస కార్మికులు సొంతగడ్డకు చేరుకునే అవకాశం ఉందని అంటున్నారు. క్షమాభిక్ష అమలు చేసిన సమయంలో వీసా గడువు ముగిసినవారు ఎలాంటి జరిమానా చెల్లించకుండా, జైలు శిక్ష అనుభవించకుండానే ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుంది.

'రావి' విగ్రహ నమూనా చిత్రానికి ఆమోదం



భువనగిరి రూరల్: తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటుకు సంబంధించి రూపొందించిన నమూనా చిత్రానికి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆమోదం తెలిపింది. ఆదివారం యాదాద్రి జిల్లా భువనగిరి మండలంలోని బొల్లెపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ నమూనా కోసం భువనగిరి జోత్స్న వేసిన చిత్రాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కుటుంబ సభ్యుల వద్ద ఉన్న ఫొటోల ఆధారంగా, రావి నారాయణరెడ్డి సమకాలికుల సలహాలు, సూచనల ద్వారా మెరుగులు దిద్ది రావి ఆకృతిని చిత్రించినట్లు జోత్స్న తెలిపారు. జూన్ 4న రావి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మొదట ప్రకటించినా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అదేరోజు రానుండడంతో విగ్రహ ఆవిష్కరణ తేదీని వాయిదా వేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి రావి సుఖేశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రావి ప్రభాకర్ రెడ్డి, చెరుకుపల్లి మహేశ్, రావి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వడగళ్లవానతో భారీ నష్టం

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 26,129 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- రేకుల షెడ్డు కూలి రెండు ఆవులు, నాలుగు దూడల మృత్యువాత

సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వానతో పంటలు దెబ్బతిన్నాయి. కామారెడ్డి జిల్లాలో 15 మండలాల్లోని 130 గ్రామాల్లో 20,071 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో 14,553 మంది రైతులు నష్టపోయారని నివేదికలో పేర్కొన్నారు. వరి 16,298 ఎకరాల్లో, మక్క 2,784.16 ఎకరాల్లో, జొన్న 705.2 ఎకరాల్లో, గోధుమ ఐదు ఎకరాల్లో, ఉల్లిగడ్డ 12 ఎకరాలు, బొప్పాయి పది ఎకరాలు, పొగాకు 20 ఎకరాలు, మామిడి 192 ఎకరాలు, కూరగాయలు 45 ఎకరాల్లో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రహ్మాజీవాడి గ్రామంలో గాలిదుమారానికి రేకుల షెడ్డు కూలిపోవడంతో అందులో ఉన్న రెండు ఆవులు, నాలుగు దూడలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరోనాలుగు గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో 6,058 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పది మండలాల్లోని 44 గ్రామాల్లో వడగళ్లు బీభత్సం సృష్టించాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. 3,076 మంది రైతులు నష్టపోయారన్నారు. అత్యధికంగా 5,661 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. 292 ఎకరాల్లో మక్క, 93 ఎకరాల్లో జొన్న, 12 ఎకరాల్లో నువ్వుల పంట దెబ్బతిన్నదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.


కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మైలారంలో నేలవాలిన వరి పంటను చూపుతున్న రైతు

ఎండ రాకుండానే శ్లాబ్ వేద్దామని వెళుతూ..

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. చికిత్స పొందుతూ మరొకరు
- ముగ్గురూ తాపీ పనులు చేసేవారే..

కోరుట్ల: తెల్లవారక ముందే ముగ్గురి బతుకులు తెల్లారిపోయాయి. ఎండ ముదరక ముందే శ్లాబ్ వేసే పనులు పూర్తి చేయాలన్న ఆత్రుత లారీ రూపంలో వారిని బలిగొంది. స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా కొండసముద్రం గ్రామానికి చెందిన బడికెల వేణుగోపాల్(32) తల్లిదండ్రులు జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు–ముత్యంపేట గ్రామానికి 25 ఏళ్ల కిత్రం వలస వచ్చారు. తాపీమేస్త్రీ అయిన వేణుగోపాల్ మెట్‌పల్లిలోని ఓ ఇంటి నిర్మాణానికి శ్లాబ్ వేసేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఆ పనులు చేసేందుకు తను నివసించే గ్రామానికి చెందిన కూలీలు పసులోటి శ్రీకాంత్(26), కొమురం వెంకటేశ్(34)లను తీసుకొని మోటార్‌సైకిల్‌పై ఆదివారం వేకువజామున 4.30 గంటలకు మెట్‌పల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో ఉదయం 5.45 గంటలకు మోటార్‌సైకిల్‌పై కోరుట్ల మండలం మోహన్‌రావుపేట్ శివారు దాటుతుండగా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెనుక కూర్చున్న పసులోటి శ్రీకాంత్, కొమురం వెంకటేశ్ ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న వేణుగోపాల్ తీవ్రంగా గాయపడి కొనఊపిరితో ఉండగా, పోలీసులు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు.


వేణుగోపాల్, శ్రీకాంత్, వెంకటేశ్ (ఫైల్)

ఘటనాస్థలాన్ని కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, కోరుట్ల, మేడిపల్లి ఎస్ఐలు కిరణ్, శ్యాంరాజ్, శ్వేత పరిశీలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్ లారీతో పరారయ్యాడని, నంబరు ఆధారంగా రాజస్తాన్‌కు చెందిన లారీగా గుర్తించామని సీఐ తెలిపారు. వేణుగోపాల్‌కు భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉండగా, శ్రీకాంత్ భార్య శిరీష 7 నెలల గర్భిణి కావడంతో మృతుల బంధువర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వెంకటేశ్‌కు బంధువులెవరూ లేకపోవడంతో కోరుట్ల అధికారులు అంత్యక్రియలు నిర్వహించారు.

జిల్లా వార్తలు

'పది' విద్యార్థులకు రవాణా ఏర్పాట్లు

ఖమ్మం మామిళ్లగూడెం : నేటి నుంచి నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు రవాణా ఇక్కట్లు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు. పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. బస్‌పాస్ కలిగిన విద్యార్థులు తమ రూట్‌తో సంబంధం లేకుండా హాల్‌టికెట్ పై ఉన్న పరీక్ష కేంద్రానికి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. బస్‌పాస్ లేని విద్యార్థులు సాధారణ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందని, బస్‌పాస్ గలవారు కాంబినేషన్ టికెట్ తీసుకుని ఎక్స్‌ప్రెస్‌ల్లో కూడా ప్రయాణించవచ్చని తెలిపారు. ఏప్రిల్ 2 వరకు సెలవు రోజుల్లోనూ ఈ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఖమ్మం(99592 25958), మధిర (99592 25961), సత్తుపల్లి (99592 25962), భద్రాచలం (99592 25960), కొత్తగూడెం (99592 25959), మణుగూరు (99592 25963), ఇల్లెందు (99592 25959) డిపోలలో సంప్రదించాలని వివరించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 551 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,710 ఆదాయం లభించగా, 250 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.12,450 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

నష్టపరిహారం ఇవ్వాల్సిందే..

ఖమ్మంలీగల్ : భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లికి చెందిన ఎ.ఉమామహేశ్వరరావు 2022 ఏప్రిల్‌లో మెడ్‌లైట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి రూ.1.90 లక్షల విలువైన ప్యూరిఫైడ్ కొనుగోలు చేశారు. అయితే అనతికాలంలోనే మరమ్మతుకు గురికావడంతో దాన్ని వాపస్ తీసుకుని కొత్తది ఇవ్వాలని కంపెనీని అడగగా, నిబంధనల మేరకు సాధ్యం కాదని ప్రతినిధులు తెలిపారు. దీంతో బాధితుడు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా, విచారణ చేపట్టిన చైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత.. కంపెనీ సేవా లోపాన్ని నిర్ధారిస్తూ బాధితుడికి రూ.1.90 లక్షలతో పాటు రూ.10 వేలు జరిమానా, రూ.10వేలు కేసు ఖర్చులు కూడా చెల్లించాలని తీర్పు చెప్పారు. బాధితుడి తరఫున న్యాయవాదులు ఎస్.చార్లెస్ వినయ్, కె.కుమార్ వాదించారు.

దెబ్బకు ఠా.. కోతుల ముఠా

- వానరాల నుంచి పంటల రక్షణకు రైతుల ప్రయత్నాలు
- క్షేత్రాల చుట్టూ ఏటవాలు నైలాన్ నెట్ల ఏర్పాటు
- మంకీ గన్స్.. సోలార్ ఫెన్సింగ్ కూడా..
- వినూత్న పద్ధతులతో ఫలితాలు సాధిస్తున్న రైతాంగం


పుచ్చతోటకు ఏర్పాటుచేసిన సోలార్ ఫెన్సింగ్


మామిడి తోట రక్షణకు సోలార్ ఫెన్సింగ్

ఖమ్మంవ్యవసాయం: కోతుల బెడద నానాటికీ పెరుగుతోంది. ఇళ్లలోకి జొరబడడమే కాక వానరాల కారణంగా రైతులు ఆరుగాలం శ్రమించి సాగుచేసే పంటలకూ ముప్పు వాటిల్లుతోంది. జీవన పోరాటంలో భాగంగా కోతులు మైదాన ప్రాంతాల్లోకి వస్తూ రైతులు, ప్రజలు సాగు చేసే, పండించే పంటలు, పండ్లపైనే ఆధార పడుతుండగా పంటలు ధ్వంసమవుతున్నాయి. వానరాల కారణంగా ఎదురవుతున్న నష్టాలతో కొందరు పంటలను సాగు చేయాలంటే వెనుకంజ వేస్తుండగా.. ఇంకొందరు మాత్రం ప్రత్యామ్నాయ చర్యలు పాటిస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ నేపథ్యాన రాష్ట్రంలోనే ఉద్యానవన పంటలకు పేరుగాంచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు 1.30 లక్షల ఎకరాల్లో పండ్లు, కూరగాయల పంటలను సాగు చేస్తున్నట్లు అంచనా. వీటికి తోడు వరి, పత్తి, మిర్చి తోటలకు కూడా కోతుల బెడద ఉండగా.. ప్రత్యామ్నాయ మార్గాలను పలువురు ఎంచుకుంటున్నారు.

వానర సైన్యం నడుమ 60 ఎకరాల సాగు

అటవీ ప్రాంతానికి దగ్గరగా, వానర సైన్యం నడుమ సుమారు 60 ఎకరాల్లో భిన్నమైన పంటలను సాగు చేస్తున్నారు బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన యర్రం లక్ష్మీరెడ్డి. ఈయన జామ, పుచ్చ, బొప్పాయితో పాటు వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తుండగా కోతుల బెడద పెరిగిన క్రమాన తక్కువ ఖర్చుతో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 20 అడుగుల తాటి కొయ్యలు (ఒక్కొక్కటి రూ.70) తోటల చుట్టూ నాటి వాటికి 10 నుంచి 12 వరుసల్లో టాటా వైర్లను అల్లించారు. సోలార్ బాక్సులను ఏర్పాటు చేసుకొని ఇన్సులేటర్ విధానం అమలు చేస్తున్నారు. దీంతో ఆ తోటల వద్దకు కోతులు, జంతువులు రావటం లేదు.


యర్రం లక్ష్మీరెడ్డి


జామ తోటకు బందోబస్తుగా తీగలతో రక్షణ

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే..

- తోటల చుట్టూ 5 నుంచి 6 వరుసల కుసుమ పంటను విత్తుకోవాలి. ఈ పంటకు ఉండే ముళ్ల వలన కోతులు, కుక్కలు, పందులు ఇతర జంతువుల నుంచి పంటల రక్షణ పొందవచ్చు. కుసుమ పంట ద్వారా నూనె సైతం లభిస్తుంది.
- కోతుల నివారణకు అగ్రీ మంకీ గన్స్ వాడవచ్చు. మంకీ గన్‌లో కొద్దిగా కాల్షియం కార్బైడ్, రెండు చుక్కల నీరు వేసి పేల్చాలి. దీంతో గుంపులు, గుంపులుగా ఉన్న వానర సైన్యం బెదిరి దూరం వెళ్తాయి.
- చేను చుట్టూ ఆరు నుంచి ఎనిమిది అడుగుల ఎత్తులో వెదురు కర్రలను ఉపయోగించి వల (నెట్స్) వేసుకోవడం వలన కోతుల నుంచే కాక జంతువుల నుంచి పంటలకు రక్షణ ఉంటుంది.
- తోటల చుట్టూ రక్షణగా ఉన్న ఫెన్సింగ్‌కు టాటా వైర్లను వినియోగించి సోలార్ డైర బ్యాటరీతో అనుసంధానం చేయవచ్చు. దీనికి ఎకరాకు రూ.5 వేలు ఖర్చు వస్తుంది. ఈ సోలార్ వైర్ల ద్వారా ఎలాంటి ప్రమాదం ఉండదు. కోతులు, జంతువులు ఈ సోలార్ తీగలకు తగిలితే జల్లుమని పారిపోతాయి. వీటి వల్ల ఎలాంటి ముప్పు జరగదు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పలువురు రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తూ ఫలితాలను సాధిస్తున్నారు.
- లేజర్ లైట్స్ వినియోగించటం ద్వారా కూడా వానర సైన్యం బెదిరిపోతుంది.
- పెంపుడు కుక్కలు, కొండముచ్చులను కూడా రైతులు వినియోగిస్తున్నారు. అయితే, వీటి నుంచి కోతులు అంతగా బెదరడం లేదు.

సోలార్ ఫెన్సింగ్‌తో సులభం



కోతులు, జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. రెండున్నర ఎకరాల్లో జామ తోట వేసి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశా. దీంతో కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం లభించింది. మూడేళ్లుగా ఆశించిన విధంగా దిగుబడి, మంచి ఫలితాలు సాధిస్తున్నా.

–బానోతు బిచ్చు, సూర్యాతండా, రఘునాథపాలెం మండలం

వలకు తోడు సోలార్ ఫెన్సింగ్



ఎకరం భూమిలో జామ, చుట్టూ కొబ్బరి, అంతర పంటగా కూరగాయలు సాగు చేస్తున్నాం. ఇక్కడ కోతుల బెడద ఉండడంతో కాపలాదారులను పెట్టినా ఫలితం రాలేదు. ఆ తర్వాత వలతో పాటు సోలార్ ఫెన్సింగ్ వేశాక ఇబ్బంది తీరింది. ఎకరాకు రూ.32 వేలు ఖర్చయినా శాశ్వత పరిష్కారం లభించింది.

–యు.వెంకటరెడ్డి, చల్లసముద్రం, ఇల్లెందు మండలం

ప్రత్యామ్నాయ మార్గాలు అనేకం



కోతులు, జంతువుల నుంచి పంటల రక్షణకు అనేక మార్గాలు వచ్చాయి. తోటల చుట్టూ వలలు ఏర్పాటు చేసుకోవచ్చు. మంకీ గన్స్ వినియోగించి శబ్దాలతో వాటిని అడవులకు పంపొచ్చు. సోలార్ ఫెన్సింగ్ విధానమైనా మంచిదే. అడవులను రక్షిస్తే పండ్ల లభ్యత ఉండి కోతులు వెనక్కి వెళ్తాయి.

–జీనుగు మరియన్న, ఉద్యానాధికారి, మహబూబాబాద్ జిల్లా

కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- డీఏ విడుదల చేసి, ఫిట్‌మెంట్ పెంచాలి
- ఈయూ రాష్ట్ర మహాసభల్లో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎస్ బోస్



మాట్లాడుతున్న బీఎస్ బోస్

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు దన్నుగా నిలిచారని, మూడు నెలల్లో 22 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చారని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎస్ బోస్ తెలిపారు. ప్రభుత్వానికి దన్నుగా నిలిచిన కార్మికుల పట్ల ఫిట్‌మెంట్, హెచ్ఎస్ఏతోపాటు బకాయిపడిన డీఏ చెల్లింపుల్లో వివక్ష తగదన్నారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మూడో మహాసభల ముగింపు సమావేశం ఆదివారం ఎస్.బాబు అధ్యక్షతన టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్లో జరిగింది. బోస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, అపాయింట్‌మెంట్ డేట్ ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు కేవలం 21 శాతం ఇవ్వడం శోచనీయమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య రెండు రెట్లు పెరిగిందని, సిబ్బంది, బస్సుల సంఖ్య అలాగే ఉండటంతో పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. ఓవర్‌లోడ్‌తో పాటు సమయపాలన లోపించిందని, ఏ బస్సు ఎప్పుడు గమ్యస్థానం చేరుతుందో తెలియని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత చట్టం డ్రైవర్ల పాలిట శాపంగా మారేదని, కార్మిక పోరాటాలకు తలొగ్గి చట్ట అమలును తాత్కాలికంగా వాయిదా వేశారని చెప్పారు. అధికారం కోల్పోయాక బీఆర్ఎస్‌కు కార్మికులు, కార్మిక చట్టాలు గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. కాగా, మహాసభల్లో 21 తీర్మానాలను ప్రతినిధులు చర్చించి ఆమోదించారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, పరిష్కారం కాని పక్షంలో ఆందోళన బాట పట్టాలని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ సీనియర్ నాయకులు కె.పద్మాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు నర్సింహంతోపాటు ఈదురు వెంకన్న, పాటి అప్పారావు, తోట రామాంజనేయులు, జె.రాఘవులు, జీడీ ప్రసాద్, తిమ్మినేని రామారావు, కె.భాస్కర్, పిల్లి రమేశ్, వెంకటరెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి చేస్తా..

మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్


మాట్లాడుతున్న పోరిక బలరాంనాయక్

ఇల్లెందు: రాబోయే కాలంలో ఎంపీగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధి సాధిస్తానని మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో బలరాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బయ్యారం స్టీల్ ప్రాజెక్టు కోసం ప్రత్యేక జీఓ తీసుకొచ్చామని, ఈ దఫా ప్రాజెక్టును కచ్చితంగా సాధిస్తానన్నారు. అంతేకాక ఇల్లెందులో నిర్వీర్యమైపోతున్న సింగరేణిలో కొత్త బావులు సాధిస్తామని, ఇల్లెందుకు రైలు పునరుద్ధరణ, మోడల్, ఏకలవ్య పాఠశాలల సాధనలో ముందుంటానని తెలిపారు. ఈ దేశానికి కాంగ్రెస్ మాత్రమే విజన్ ఉన్న పార్టీ అని, బీజేపీకి 200 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. బీఆర్ఎస్ నుంచి 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ కాల్వను ఖమ్మం వద్ద మళ్లిస్తే ఇల్లెందు, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందని వివరించారు. వచ్చే రెండు నెలలు తన గెలుపు కోసం కష్టపడి పనిచేస్తే ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేస్తానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేయబోయే కాంగ్రెస్‌కు మాత్రమే ప్రజలను ఓటు అడిగే హక్కు ఉందని, మే 13న జరిగే ఎన్నికల్లో బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మాజీ ఎంపీపీ మోకాళ్ల వెంకటమ్మ, సొసైటీ చైర్మన్ మెట్టేల కృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాలరెడ్డిలతో పాటు మేకల మల్లిబాబుయాదవ్, నర్సింహారెడ్డి, ధనియాకుల రామారావు, కంబాల ముసలయ్య, దేవానాయక్, ఎట్టి హరికృష్ణ, దొడ్డా డానియేల్, జె. వెంకటేశ్వర్లు, సామ్రాట్, తదితరులు పాల్గొన్నారు.